క్లుప్తంగా

రూపాంతర ఆలయానికి విరాళం



రూపాంతర ఆలయానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం రూపాంతర ఆలయానికి లంకపల్లి త్యాగరాజు కొర్నేలియస్, రాజమణి దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. మణిపూర్‌లో మారణకాండను నిరసిస్తూ భీమవరం రూపాంతర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని కోరారు. ర్యాలీలో ఆర్.కమలరాజు, ఉన్నమట్ల కరుణాకరరావు, సోడదాసి రూబెన్, పీజే విజయరాజు, ఈదా జయరావు, పాకెర్ల విజయ్‌కుమార్, కె.శ్యాం ప్రసాద్, చిన్నం కమలహాసన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో జనసైనికులకు చుక్కెదురు

ఆకివీడు: భారీ వర్షాలకు రోడ్లు పాడైపోయాయని, కాలనీ మునిగిపోతుందని ఆందోళనకు దిగిన జన సైనికులకు మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులో చుక్కెదురైంది. కాలనీలో సుబ్బలక్ష్మీ అనే మహిళ ఎదురు తిరిగి మీకు ఇక్కడ పని ఏంటి? అని ప్రశ్నించింది. మీరు మాకు ఇల్లు ఇచ్చారా? స్థలం ఇచ్చారా? అంటూ నిలదీసింది. దీంతో ఆ ప్రాంతంలో కొద్ది సేపు వాగ్వివాదం జరిగింది. అనంతరం జనసైనికులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

నేడు పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం(ప్రకాశంచౌక్): పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరాన్ని సోమవారం సాయంత్రం స్థానిక మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహించనున్నట్టు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణుడు కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 15 సంవత్సరాలలోపు చిన్నారులకు ఈ క్యాంపులో ఉచిత పరీక్షలు, చికిత్సకు వైద్య సాయం అందిస్తారని తెలిపారు. వివరాలకు సెల్ నెంబర్లు 99490 93115, 94408 59700లో సంప్రదించాలని కోరారు.

ఆకివీడు సీఐగా సత్యనారాయణ



ఆకివీడు: ఆకివీడు రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా కెవీవీఎస్.సత్యనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరం క్రైం బ్రాంచి సీఐగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన గీతా రామకృష్ణ ఇటీవల బదిలీ అయిన విషయం విదితమే.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రాకతో కూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగుకుంగా ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాలకు మేలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికైనప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమం అనే రెండు కళ్ల సిద్ధాంతంతో రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారని జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. తాడేపల్లిగూడెం మండలానికి విచ్చేసిన రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖామంత్రివర్యులు మెరుగు నాగార్జునకు ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సమక్షంలో చీకటిమిల్లి మంగరాజు వినతిపత్రం సమర్పించారు. మంగరాజు మాట్లాడుతూ ప్రభుత్వంచే రాష్ట్రంలోని రైతులకు, అన్ని వర్గాల వారికి విద్యా, ఆరోగ్యం, పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలు వంటి అనేక సంక్షేమాలు అమలు జరుగుతున్నాయని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను భారత కరెన్సీ నోట్లు మీద ముద్రించే విధంగా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అన్ని పథకాలు దళితులకు అందేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి



తుందుర్రులో ర్యాలీ నిర్వహిస్తున్న దళిత క్రైస్తవులు



కాళ్ల ఎస్సై మూర్తికి వినతి పత్రం అందజేస్తున్న క్రైస్తవ సంఘం నాయకులు

భీమవరం అర్బన్: మణిపూర్‌లో గిరిజన క్రైస్తవులపై జరిగిన మరణ హోమం, దాడుల నేపథ్యంలో రాష్ట్రపతి పాలన విధించాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ డిమాండ్ చేశారు. భీమవరం మండలం తుందుర్రు గ్రామంలో మణిపూర్‌లో గిరిజన క్రైస్తవులపై జరిగిన దాడులకు నిరసనగా దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందర్ కుమార్ మాట్లాడుతూ మణిపూర్ గిరిజన క్రైస్తవులపై మరణ కాండను అదుపు చేయడంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, దేశ ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. మణిపూర్‌లో వెంటనే శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో దాడులు, గిరిజన మహిళలపై హత్యలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ శాంతియుత ర్యాలీలో పాలపర్తి జోనా, మైలాబత్తుల మోజేస్, మద్దా భాస్కరరావు, కురేళ్ల జార్జ్‌ముల్లర్, కలిగితి దావీదు రాజు, వర్థనపు మోషే, పి.డేవిడ్, అంబటి ఆనంద్‌కుమార్, దళిత క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు రక్షణ కల్పించాలి

కాళ్ల: దేశంలో క్రైస్తవులకు రక్షణ కల్పించి శాంతిని కలుగజేయాలని రాష్ట్ర క్రైస్తవ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్ కోరారు. మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించి మణిపూర్లో శాంతిని నెలకొల్పాలని కోరుతూ ఆదివారం భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. కాళ్ల మండల పాస్టర్స్ ఫెలోషిప్, ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్, సీఎస్ఐ, సీబీసీఎంసీ సంఘాలు, జక్కరం ప్యారిస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కాళ్ల మండల ఐక్యవేదిక ఆధ్వర్యంలో క్రైస్తవ సంఘాలు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ముందుగా మేడిది జాన్సన్ శాంతికపోతం ఎగురవేసి శాంతిని కలుగజేయాలని కోరారు. కాళ్ల మండలం కోపల్లె గ్రామం నుంచి రాష్ట్ర రహదారి వెంబడి కాళ్ల పోలీస్ స్టేషన్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాళ్ల ఎస్సై ఏజీఎస్ మూర్తికి వినతిపత్రం అందజేశారు.

ఉండిలో..

ఉండి: మణిపూర్ ధమనకాండకు బాధ్యులైన దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఉండి గోరింతోట ప్రాంతంలో మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చిట్టి అన్నవరం, రామకూరి వెంకటరత్నం, మునకాల రాజు, కొల్లి రత్న కుమారి, మేడిది రత్నకుమారి, బొడ్డు మేరీ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం



తుందుర్రులో మాట్లాడుతున్న సుధీర్

భీమవరం అర్బన్: మానవ అక్రమ రవాణా తీవ్రమైన నేరమని ప్యానల్ లాయర్ ఎస్ సుధీర్ అన్నారు. భీమవరం మండలం తుందుర్రు గ్రామంలో సచివాలయంలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం ఆదివారం నిర్వహించారు. మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్యానల్ లాయర్ సుధీర్ మాట్లాడారు. ఆడపిల్లలపై సోషల్ మీడియాలో ఎక్కువ ప్రభావం ఉన్నదని, తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ వార్తల ద్వారా ప్రపంచంలో ఏదో ఒక చోట హ్యూమన్ ట్రాఫికింగ్‌కి గురై హత్యలు జరుగుతున్నట్టు వింటూనే ఉంటున్నామని తెలిపారు. పిల్లలు, మహిళలను కిడ్నాప్ చేసి ఇతర దేశాలకు అమ్మి సొమ్ము చేసుకునే ముఠాలు మన దేశం, రాష్ట్రంలోను ఉన్నాయని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి మోసపూరితమైన మాటలు నమ్మకూడదన్నారు. పేదరికం కూడా మానవ అక్రమ రవాణాకు ముఖ్య కారణమని తెలిపారు. దీన్ని అరికట్టేందుకు గ్రామ స్థాయి నుంచి ఐక్యత కలిగి ఉండాలని, గ్రామంలో కొత్త వ్యక్తులు, అనుమానస్పదంగా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్యానల్ లాయర్ డి.రవికిరణ్, పారాలీగల్ వలంటీర్ ఎం కమల్ రాజు, సర్పంచ్ ఆరేటి వీరాస్వామి నాయుడు, ఎం పోలురాజు, ఎస్ సురేష్ కుమార్, ఎం మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవత మండల శాఖ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జానకి రామరాజు

సాక్షి, భీమవరం: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ భీమవరం మండల శాఖ సర్వసభ్య సమావేశం స్థానిక ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో ఆదివారం భీమవరం మండల శాఖ అధ్యక్షుడు బుద్ధరాజు వెంకటపతి రాజు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకి రామరాజు విచ్చేసి మాట్లాడుతూ ప్రకృతి మనకు ప్రసాదించిన పర్యావరణాన్ని కాపాడుకోవడానికి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, అంతిమ సంస్కార సహాయ కార్యక్రమాలు, అభాగ్యులకు సేవా కార్యక్రమాలు, సంస్థ కార్యకలాపాలను విశదీకరించారు. వేదికపై సంస్థ జిల్లా కన్వీనర్ కాకర్ల వినాయక్, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర నాయకులు మంతెన రామచంద్రరాజు, అల్లూరి నరసింహరాజు, కంతేటి వెంకటరాజు, మానవత విలువలపై మాట్లాడారు. సంస్థ కార్యదర్శి కారుమూరి బాబు, సన్నిధి నాగభూషణం, ఇందుకూరి ప్రసాదరాజు, మంతెన ఝాన్సి, అల్లు శ్రీనివాస్, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలి



గృహ నిర్మాణ శాఖ అధికారులతో మాట్లాడుతున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల్లో పురగతి కనిపించేలా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహనిర్మాణ పురోగతిపై ఆరా తీశారు. లే అవుట్ పూడిక పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు చురుగ్గా కొనసాగేందుకు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. లే అవుట్‌లలో పూడిక పనులు పూర్తయి పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు హౌసింగ్ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వేగంగా ఇళ్ల నిర్మాణాలు చేసుకోవడానికి ముందుకు వచ్చిన వారికి ప్రభుత్వ పరంగా అందించే మెటీరియల్‌ను సకాలంలో అందించాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పనులు వేగవంతంగా జరపాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ జయరాజు, డీఈఈ పి.వెంకటేశ్వరరావు, ఏఈలు రవీంద్ర, నరేష్, కామన బాల సత్యనారాయణ, బుల్లి మస్తాన్, భూసారపు జయప్రకాష్, దొంగ మురళీకృష్ణ, గోరు సత్తిబాబు, తిరుమాని నాగరాజు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులపై అప్రమత్తత అవసరం



నరసాపురంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

నరసాపురం రూరల్: ఆడపిల్లలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారు చెప్పే మాయ మాటలకు ప్రలోభాలకు లోనై వారి వెంట వెళ్లొద్దని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు అన్నారు. నరసాపురం పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్ నెం.2 లో ఆదివారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలికల హక్కుల గురించి అక్రమ రావాణాకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి తెలియజేశారు. చదువుకునే వయస్సులో చదువు పట్లమాత్రమే శ్రద్ధ వహించాలన్నారు. హస్టల పరిసరాల్లో పోకిరీ పిల్లలు సంచరించకుండా గస్తీ చర్యలు తీసుకోవాలని పోలీసు వారికి సూచించారు. తొలుత హాస్టల్ పరిసరాలను తనిఖీ చేశారు. వార్డెన్ షీలాను పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 1వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కె శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా దానయ్యనాయుడు పాల్గొన్నారు.

మంత్రి నాగార్జునకు ఘన స్వాగతం

పోడూరు: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పశ్చిమగోదావరి జిల్లా పర్యటన అనంతరం రాజమండ్రి వెళ్లే మార్గంలో పెనుగొండ మండలం దొంగరావిపాలెం బ్రిడ్జి వద్ద ఆయనకు ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మేరుగ నాగార్జున మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి, ఆచంట శాసనసభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు నాయకత్వంలో ఆచంట నియోజకవర్గం లో మరోసారి వైసీపీ జెండా ఎగరావేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంత్రి నాగార్జునకు స్వాగతం పలికిన వారిలో ఉదారగొండి చంద్రమౌళి, సిద్ధాంతం ఎంపీటీసీ సభ్యులు చిన్నం ఏడుకొండలు, వడ్లపాటి అంబేడ్కర్, రొక్కల సామ్యూల్, ఉటాల. శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, భీమవరం: విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి రానున్న కాలంలో పోరాటానికి సిద్ధపడాలని యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ జె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన పోరాట కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా ఏఐటీయూసీ జిల్లా నాయకులు చెల్లబోయిన రంగారావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్‌మోహన్‌రాయ్ హాజరై మాట్లాడారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. నాయకులు వి.శ్రీనివాస్, సీహెచ్ కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల

భీమవరం అర్బన్: భీమవరం మండలం పెదగరువులో విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో లైన్లపై చెట్ల కొమ్మలు, వార్షిక మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. వెంప, శ్రీరామపురం, శివన్నారాయణపురం గ్రామాల్లో సోమవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

కాళ్ల: వేర్వేరు ప్రాంతాల్లో పేకాట శిబిరాలపై దాడి చేసి 7 మందిపై కేసు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కాళ్ల మండలం దొడ్డనపూడి, సీసలి గ్రామాల్లో పేకాట ఆడుతున్నరనే సమాచారం మేరకు కాళ్ల ఎస్సై ఏజీఎస్ మూర్తి సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో దొడ్డనపూడిలో 4 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.1,430 నగదు, అదేవిధంగా సీసలిలో ముగ్గురిని అదుపులోకి తీసుకొని రూ.1,100 నగదు స్వాదీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉండిలో..

ఉండి: మండలంలోని పెదపుల్లేరులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు, ఉండి పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 23900 నగదు, నాలుగు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే యండగండిలో నిరిర్వస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై కె.గంగాధర రావు ఆధ్వర్యంలో నిర్వహించిన దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.16200 నగదు,నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అత్తిలిలో ఉచిత వైద్యశిబిరం

అత్తిలి: పట్టణంలో ఆదివారం సన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అత్తిలి గ్రామానికి చెందిన కొండే ప్రవీణ్ జ్ఞాపకార్థం స్నేహితులు ఆధ్వర్యంలో ఏర్పాటు మెడికల్ క్యాంపు ఏర్పాటుచేశారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

పోడూరు: ప్రజల ఆరోగ్యమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం స్పష్టం చేశారు. కొడమంచిలి పంచాయతీలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకర సీతారాం మాట్లాడుతూ అధిక వర్షాల నేపథ్యంలో ఎక్కడైనా జ్వరాలు గానీ, ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉంటే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందిని కోరారు., గ్రామంలో ఎక్కడ కూడా ఏ విధమైన ఆరోగ్య పరంగా సమస్యలు రాకూడదని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎంఎల్‌హెచ్‌పీ రూపాంజలి, రాశి, ఏఎన్ఎంలు పుష్ప రాజ్యం, వెంకటరమణ పాల్గొన్నారు.

వశిష్ట లియో క్లబ్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): యువత లయనిజంలో ఉంటూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని, వశిష్ట లియో క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం డైమండ్స్ సభ్యులు కె.సాయి సత్యనారాయణ రాజు సౌజన్యంతో లార్డ్స్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోంలో విద్యార్థులకు స్నాక్స్, స్టేషనరీ, భోజనం అందజేశారు. లియో క్లబ్ సభ్యులు మాధురి, సంపత్, కె.లక్ష్మి, సతీష్, రాజేష్, యర్రా ఆంజనేయస్వామి పాల్గొన్నారు.

భూ సేకరణపై అవినీతి ఆరోపణలు సరికాదు

- ప్రమాణం చేయాలని గోవిందావుకు విజయరామ్ సవాల్



యనమదుర్రులో మాట్లాడుతున్న రైతు విజయరామ్, సంజన దెవలపర్స్ అధినేత జాని

భీమవరం అర్బన్: గునుపూడి జగనన్న కాలనీ లే అవుట్ భూ సేకరణపై జనసేన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు అసత్య ఆరోపణలు చేస్తున్నారని రైతు తిరుమల విజయరామ్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం యనమదుర్రు గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2019లో పేదల సొంత ఇంటి కలను నిజం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూ సేకరణ చేసే సమయంలో భీమవరం నియోజకవర్గానికి సంబంధించి 300 ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉండటంతో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనను, సంజన డెవలపర్స్ అధినేత జాని, కొందరు రైతులను పిలిచి భూ సేకరణకు సహకరించాలని కోరగా ఖరీదైన భూములు 70 ఎకరాలు నాడు గునుపూడి లే అవుట్ నిమిత్తం ప్రభుత్వానికి ఇచ్చామన్నారు. నాడు గవర్నమెంట్ వాల్యూయేషన్ ఎకరానికి రూ.53 లక్షలు ఉండగా రెట్టింపు అంటే రూ.కోటీ 6 లక్షలు ఇచ్చారని, ఇదంతా రైతుల ఖాతాలోకి నేరుగా జమయ్యాయని వివరించారు. దీనికి సంబంధించి ఎక్కడా లంచం ఇవ్వలేదని తెలిపారు. ఈ భూ సేకరణలో అవినీతి జరగలేదని తాను, జాని మావుళ్లమ్మ ఆలయానికి వచ్చి ప్రమాణం చేస్తామని, అవినీతి ఆరోపణలు చేస్తోన్న గోవిందరావు ఆలయానికి వచ్చి ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి రేయింబవళ్లు కృషి చేస్తోన్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌పై అవినీతి ఆరోపణలు చేస్తే సహించేది లేదని విజయరామ్ హెచ్చరించారు. సమావేశంలో రైతులు పాల్గొన్నారు.

నేడు ఏలూరుపాడులో గడపగడపకు మన ప్రభుత్వం

కాళ్ల: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏలూరుపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆదివారం తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఏలూరుపాడు గ్రామంలో సచివాలయం 2 పరిధిలో పెద్దపేట సీఎస్ఐ రారాజు చర్చి వద్ద నుంచి కార్యక్రమం మొదలవుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పర్వతారోహణ చేయాలనుకునే వారికి సాయం



సమావేశంలో మాట్లాడుతున్న బాబి

సాక్షి, భీమవరం: పర్వతారోహణ చేయాలనే ఆసక్తి గల పేద అభ్యర్థులు లేదా ఔత్సాహికులకు యూత్ హాస్టల్స్ అసోసియేషన్ భీమవరం యూనిట్ ఆర్థిక సాయం అందించేందుకు కృషిచేస్తోందని యూనిట్ అధ్యక్షుడు మల్లినీడి తిరుమలరావు (బాబి) అన్నారు. స్థానిక సుంకర బ్రహ్మయ్య - సుబ్బమ్మ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం యూత్ హాస్టల్స్ అసోసియేషన్ భీమవరం యూనిట్ 34వ మహాజన సభ నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమలరావు మాట్లాడుతూ యూత్ హాస్టల్స్ అసోసియేషన్ దేశంలోని యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పర్యావరణం - పరిరక్షణకు మొక్కలను నాటుతున్నామని, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, స్థానిక మున్సిపల్ అధికారులతో ప్రపంచ దినోత్సవం సందర్భంగా కార్యాచరణకు నాంది పలికామని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీవీజే సోమరాజు, మట్లపూడి సత్యనారాయణ, గంధం చెన్ను శేషు, ఆరేటి వెంకట సత్యనారాయణ, వలవల రవీంద్రనాథ్ ఠాగూర్, పేరిచర్ల భాస్కరపెద్దిరాజు, కట్రెడ్డి సత్యనారాయణ, బోనం పాండురంగారావు, తాళ్లపూడి గాంధీ, కడియం ఈశ్వరరావు, కొప్పర్తి అప్పారావు, యర్రంశెట్టి హరినాథ్, వడ్డి వెంకట నరసయ్య, దిరిశాల సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతుడికి సాయం



శ్రీనివాస్ కుటుంబానికి సాయం అందిస్తున్న పీవీఎల్

ఉండి/పాలకోడేరు: పాలకోడేరు మండలం గరగపర్రులో గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చింతపల్లి శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదివారం డీసీసీబీ ఇన్‌ఛార్జ్ పీవీఎల్ నర్సింహరాజు పరామర్శించి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. మహదేవపట్నం శివారు ఉప్పరగూడెంలో స్థానిక సచివాలయ కన్వీనర్ పాలా రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీవీఎల్ మాట్లాడుతూ కష్ట సమయంలో తోడ్పాటును అందిస్తామని భరోసా ఇచ్చారు. ఇదే ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన కాలా శ్రీనివాస్,చింతపల్లి మాణిక్యాలరావును పీవీఎల్ పరామర్శించారు. కార్యక్రమంలో వీరవల్లి శ్రీనివాస్,పస్తుల శ్రీమన్నారాయణ,పాలా శ్రీనివాస్,గుత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

10న సర్వమత సమ్మేళనం

సాక్షి, భీమవరం: ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ గురూజీ ఆధ్వర్యంలో ఆగస్టు 10న అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో సర్వమత సమ్మేళనం నిర్వహించనున్నట్టు ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ కలిగొట్ల గోపాల శర్మ చెప్పారు. సెప్టెంబర్ 29, 30, అక్టోబర్ 1 తేదీల్లో అదే వేదిక వద్ద వరల్డ్ కల్చరల్ ఫెస్టివల్ నిర్వహిస్తారని తెలిపారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ స్థాపించి 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో సుమారు 200 దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ నెల 24 నుంచి 31వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 30 లక్షల మందితో రోజుకు 8 గంటల చొప్పున ధ్యాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, ఎం.సీతారాం ప్రసాద్, షేక్ చాన్ బాషా, చుక్కనశ్రీ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వాలంటీర్ కే.శిరీష, జవ్వాది శ్రీనివాస్, కె.ఇందిర, ఎండీ సరోజిని, బీసీ హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం అడ్డుకోవడం దారుణం



దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న సభ్యులు

తణుకు టౌన్: వేల్పూరు బీసీ కులాల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన సొమ్ములను చెల్లించకుండా టీడీపీ నాయకుల కోర్టులను ఆశ్రయించడం దారుణమని తణుకు మండల పరిషత్ అధ్యక్షుడు రుద్ర ధనరాజు చెప్పారు. వేల్పూరులో బీసీ కులాలకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సొమ్ములను చెల్లించకుండా టీడీపీ నాయకులు చేస్తున్న ఆరాచకాలకు వ్యతిరేకంగా ఆదివారం మూడో రోజు రిలేనిరాహార దీక్షలు కొనసాగాయి. వేల్పూరులోని బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో గ్రామానికి చెందిన రజకులు, టైలర్స్ యూనియన్ సభ్యులు దీక్షలు చేపట్టారు. డీసీఎంఎస్ డైరెక్టర్ పెనుమత్స సుబ్బరాజు మాట్లాడుతూ వేల్పూరు వంటి పెద్ద గ్రామంలో బీసీ కులాలకు ప్రత్యేక కమ్యూనిటీ హాల్ నిర్మాణం అవసరమన్నారు. రాష్ట్ర శెట్టి బలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వేల్పూరులో ఇప్పటి వరకూ టీడీపీ నాయకులు నీచ రాజకీయాలు రాజకీయాలు చేశారని, ఇక నుంచి వాటిని సాగనివ్వమని చెప్పారు. రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పార్టీ వేల్పూరు అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, ఎంపీపీలు కె మంగతాయారు, ఎం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.